క్లుప్తంగా

మజ్లిస్ ప్రజల పార్టీ: ఎమ్మెల్యే



మజ్లిస్ కర్ణాటక రాష్ట్ర నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజల వెంట ఉండే పార్టీ అని, అందువల్లే తమ పార్టీకి ప్రజాదరణ గణనీయంగా పెరుగుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకిలో బీజాపూర్ మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామని, ఈ కారణంతోనే తమ పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సలీం తదితరులున్నారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులతో ఇషాన్ అగర్వాల్

అబిడ్స్: ఓ సీనియర్ విద్యార్థి చాకచక్యంతో ఎంతోమంది విద్యార్థులకు చేయూతనందిస్తున్నాడు. చిరక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న ఇషాన్ అగర్వాల్ పాతబస్తీతో పాటు పలు ప్రాంతాల్లో పిల్లలకు ప్రయోజనం చేయూర్చేందుకు షా–నా–షా స్కూల్ మేనేజ్‌మెంట్‌తో కలిసి పలు విధాల సహకారాలు అందిస్తున్నాడు. ఎంపవర్ ఎడ్స్ బ్యానర్ కింద ప్రచారం చేస్తూ విద్యార్థులకు పలు రకాల పుస్తకాలతో లైబ్రరీని అందుబాటులోకి తెచ్చాడు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాడు.

చేనేత వస్త్రాలను ఆదరిద్దాం



మేళాను ప్రారంభిస్తున్న శాంతాకుమారి

గన్‌ఫౌండ్రీ: సంక్రాంతి పండగను సంతోషానికి ప్రతీకా అని జీఎస్టీ జాయింట్ కమిషనర్ శాంతాకుమారి అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని శ్రీ అవంతి సిల్క్స్ వస్త్ర షోరూమ్‌లో సంక్రాంతి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. నిర్వాహకురాలు నివేదిత మిశ్రా మాట్లాడుతూ.. తమ వద్ద చేతులతో వేసిన ప్రత్యేకమైన చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పోచంపల్లి, గద్వాల్ వంటి పలు రకాల చీరలు అందిస్తున్నట్లు వెల్లడించారు. సంక్రాంతిని పురస్కరించుకుని చేనేత ఉత్పత్తులపై 50 శాతం తగ్గింపు ధరలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ

గౌలిపురా: నగరంలో వరుసగా జరిగిన చైన్ స్నాచింగ్‌ల నేపథ్యంలో ఆదివారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలపై తిరుగుతూ మరోసారి పట్టుబడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ అంజద్ అలీ సూచించారు. ఈ తనిఖీల్లో స్టేషన్ ఎస్సై రాఘవేంద్ర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌బోర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

చార్మినార్: ఫలక్‌నుమా డాక్టర్ అంబేడ్కర్‌నగర్ బస్తీలోని బంగారం మైసమ్మ ఆలయం వద్ద ఉన్న పవర్‌బోర్‌ను బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలని డాక్టర్ అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో జలమండలి మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. బంగారు మైసమ్మ ఆలయం వద్ద 2018లో జలమండలి అధికారులు పవర్ బోర్‌ను ఏర్పాటు చేశారన్నారు. నెల రోజుల క్రితం పాడైపోయిన పవర్ బోర్‌ను వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు కోరగా.. లిస్టులో పేరు లేదని అంటున్నారన్నారు. అధికారులు స్పందించి పవర్‌బోర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

సండే.. సందడి..

- వీకెండ్‌తో కిటకిటలాడిన పాతబస్తీ పర్యాటక ప్రాంతాలు
- సరదాగా గడిపిన సందర్శకులు..
- వాహనాల రద్దీ పెరగడంతో తప్పని ట్రాఫిక్ తిప్పలు



కిటకిటలాడిన గుల్జార్‌హౌస్–చార్మినార్ పరిసరాలు

చార్మినార్: ఆదివారం పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్ కట్టడంతో పాటు హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, మక్కా మసీదు, లాడ్‌బజార్ తదితర పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల సందడి కనిపించింది. వాహనాల రాకపోకలు పెరగడంతో గుల్జార్‌హౌస్, చార్‌కమాన్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

సౌకర్యంగా మారిన కొత్తగా ఏర్పాటు చేసిన బారికేడ్లు..

వీకెండ్ రోజులతో పాటు సాధారణ రోజుల్లో కూడా చార్మినార్ సందర్శనకు పర్యాటకులు అత్యధిక సంఖ్యలో వస్తుంటారు. నగరం నుంచి వచ్చే వాహనాలను కేవలం గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ వరకు మాత్రమే అనుమతించి.. అక్కడి నుంచి కాలినడకన చార్మినార్, మక్కా మసీదు చేరాల్సి ఉంటుంది. దీంతో పర్యాటకులకు అసౌకర్యాలు కలుగకుండా గుల్జార్‌హౌస్ రోడ్డు వద్ద పర్యాటకుల సౌకర్యార్థం చార్మినార్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కాలినడకన రాకపోకలు సులభతరమయ్యాయి.

ఆటోరిక్షాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జాం..

గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ వద్ద నుంచి వాహనాలు వెనుకకు దారి మళ్లాల్సి ఉండడంతో ఇక్కడ ప్రతి నిముషం ఎంతో విలువైంది. చుట్టూ తిరిగి వెళ్లే వాహనదారులకు రోడ్డుపై ట్రాఫిక్ జాం లేకుండా ఉండాలి. అయితే ఆటోరిక్షాలు ఈ రోడ్లకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లు చేస్తూ ట్రాఫిక్ జాంలకు పాల్పడుతున్నారు. ప్రయాణికులను ఎక్కించుకునే వరకు రోడ్డుపైనే నిలిపి వేస్తుండడంతో ఇతర వాహనదారులు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై ఆటోరిక్షా డ్రైవర్లతో మాట్లాడితే.. గిరాకీ లేకపోతే.. తాము బతికేదెలా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. తమకు పార్కింగ్ స్థలం కావాలని కోరుతున్నారు.

ఘనంగా 'రవీంద్రభారతి' వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ఆడిపాడుతున్న చిన్నారులు

సంతోష్‌నగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. సంతోష్‌నగర్, ఐఎస్‌సదన్ రవీంద్రభారతి పాఠశాలల వార్షికోత్సవ వేడుకలను ఆదివారం పబ్లిక్ గార్డెన్‌లోని లలితా కళాతోరణంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో ఆసక్తి రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. రీజినల్ జోన్ ఇన్‌చార్జి బాబు, జోనల్ డీన్ జ్యోతి, డివిజనల్ ఇన్‌చార్జి దయాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురాద్‌నగర్‌లో..

గోల్కొండ: మురాద్‌నగర్ రవీంద్రభారతి పాఠశాల వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చిన్నారులు ఆడిపాడి అలరించారు. చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు దేశంలోని వివిధ సంస్కృతీ, సంప్రదాయాలు తెలియజేయడానికి ఇటువంటి వేడుకలు నిర్వహిస్తున్నామని పాఠశాల జోన్ డీన్ ప్రియామనీష్ అన్నారు. బాబురావు, కిషోర్, మధు, ప్రిన్సిపల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నియామకం



లచ్చుగుప్తాకు నియామకపత్రం అందజేస్తున్న శివప్రసాద్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర బజరంగ్‌సేనా ఉపాధ్యక్షుడిగా లచ్చుగుప్తా (ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు) నియమితులయ్యారు. ఆయనను నియమించి రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లచ్చుగుప్తా మాట్లాడుతూ.. హిందూ సంస్కృతిని, సాంప్రదాయాన్ని చాటేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. బజరంగ్‌సేనాను మరింత బలోపేతం చేస్తానన్నారు.

మగిసిన ఆర్థోపెడిక్ సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థోపెడిక్ వైద్యులు

సుల్తాన్‌బజార్: వైద్య విద్యార్థులకు ఆర్థోపెడిక్ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని హోమ్ చైర్మన్ డాక్టర్ రమేష్ అన్నారు. ఉస్మాయా జనరల్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలోని న్యూ అకాడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన హోమ్–2023 హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 21వ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థోపెడిక్ విభాగంలో అత్యాధునిక వైద్య పరిజ్ఞానం వైద్య విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. వృత్తి, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇటువంటి సదస్సు ఉపయోగపడుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులు 350 మంది వైద్య విద్య విద్యార్థులకు ఈ సదస్సులో మూడు రోజులపాటు క్లినికల్ ఎగ్జామినేషన్, ఇన్విస్టికేషన్, మేనేజ్‌మెంట్ రిహాబిలిటేషన్ వాటిపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హోమ్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ తిమ్మారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సుధీర్, డాక్టర్ శివరాం నాయక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 60 ఏళ్ల క్రితం నుంచి గతేడాది వరకు తాము చదువుకున్న పాఠశాలకు వచ్చి గత స్మృతులను నెమరువేసుకున్నారు. దశాబ్దాల క్రితం విడిపోయిన తమ ఉపాధ్యాయులను, సహచరులను వారి ఆహార్యం, మాటలను బట్టి వారెవరో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనుమిని సమన్వయ కర్త భానుమూర్తి మాట్లాడుతూ.. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేడు ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్య నిపుణులుగా, బిల్డర్లుగా, పారిశ్రామిక వేత్తలుగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం తమకు చదువుచెప్పి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునీత, ప్రభాకర్, విజయ్‌కుమార్, డాక్టర్ ఇంద్రాని పాల్గొన్నారు.

భూ కబ్జాదారుల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలి

సుల్తాన్‌బజార్: సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలం, అన్నారం గ్రామ పంచాయతి పరిధిలో భారీ కుంభకోణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని అన్నారం మాజీ సర్పంచ్ తిరుమలవాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్:101లోని 588 ఎకరాలలో 315 ఎకరాలు పట్టా భూమి ఉందన్నారు. దీనిలో భూమి హక్కులకు సంబంధించి ఉంటే ఫేక్ రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్ లాంటివి హైకోర్టులో పెండింగ్ ఉన్నాయన్నారు. మరో 273 ఎకరాలకు సంబంధించి చూస్తే అసైన్డ్ ల్యాండ్ ఉందన్నారు. దీనిలో దాదాపు 117 మంది రైతులకు ఒక్కో ఎకరా చొప్పునా అసైన్డ్ ల్యాండ్ కేటాయించడం జరిగిందన్నారు. పాత పాస్‌బుక్‌లు ఉన్నా.. ధరణి ఆన్‌లైన్ ఎంట్రీ కాకపోవడం వల్ల సర్టిఫికెట్ రాలేదన్నారు. దీనిపై భూకబ్జాదారులు 588 ఎకరాల ప్రభుత్వ భూమిని అన్యక్రాంతం చేసేందుకు భారీ పథకం వేశారని తెలిపారు. దీనిలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పంచాయతీ రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూముల్లో లే అవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దానిని వ్యతిరేకించినందుకు తనపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం భూ కబ్జాదారుల నుంచి తనకు ప్రాణరక్షణ కల్పించాలని ఆయన కోరారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని


అఫ్జల్‌గంజ్: ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గోషామహల్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్లు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మంత్రి నివాసంలో ఆయన చేతుల మీదుగా కేలండర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్, అఖిలేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మూగ జీవుల విక్రయాలు

చాంద్రాయణగుట్ట: ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, ఫర్నిచర్, బట్టలు విక్రయాలను చూశాం... ఇప్పుడు ఆన్‌లైన్‌లో మూగ జీవుల విక్రయాలు చేరాయి. ఇప్పుడు ఆన్‌లైన్ వస్తువులతో పాటు జంతువుల విక్రయాలు కూడా చేరుకున్నాయి. కొందరు అడవి జంతువులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి వాటిని ఆన్‌లైన్‌లో విక్రయించే ఆధునిక పోకడలకు తెరలేపారు. వాట్సాప్ స్టేటస్‌లో ఫొటోలు పెట్టి వాటిని విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న శాలిబండకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కోతి పిల్లలు కావలంటూ వారిని పట్టుకొని శాలిబండ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ కిషన్ జూపార్కు అధికారులతో విచారించగా కోతులపై కేసులుండవని అంబర్‌పేట్‌కు చెందిన మైనర్లు కోతి ఫొటులు వాట్సాప్‌లో పెట్టినట్లు తెలిసిందన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: కవిత్వానికి నూతన అభివృద్ధిని జోడించినప్పుడే చరిత్రలో నిలిచిపోతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సంస్కృతిక సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత్రి సత్యవేణి ప్రదర్శించిన సత్యవాక్కులు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కవిత్వం అనేక రూపాల్లో అనేక విధాలుగా రాస్తున్నారని తెలిపారు. దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షులు సూర్యప్రకాష్ రావు, ప్రముఖ కవి డాక్టర్ దీపక్, వేదిక ప్రధాన కార్యదర్శి సీతాలక్ష్మి పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జనప్రియ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. బిలాల్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. ఎస్సార్టీ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. జనప్రియ ఏబీసీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. రామ్నాస్‌పురా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. ఘాజీమిల్లత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. పూల్‌బాగ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. జంగమ్మెట్ ఓహెచ్, జంగమ్మెట్ ఏబీసీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ తెలిపారు. రెయిన్‌బజార్, మూన్ స్టార్, డ్రై ల్యాండ్, నెహ్రూనగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. రజానగర్, ఈదిబజార్, జ్యోతినగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలోని పెన్షన్‌దారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రాగానే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను దేశ వ్యాప్తంగా విస్తరిస్తాం



హోం మంత్రితో సలావుద్దీన్ లోధి

చార్మినార్: బీఆర్ఎస్ పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరించే కార్యక్రమంలో భాగంగా తాను ఇటీవల మహారాష్ట్ర వెళ్లి పలువురు నాయకులను తమ పార్టీలో చేర్పించిన విషయాన్ని హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి వివరించినట్లు చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి తెలిపారు. మహారాష్ట్రలో తమ పార్టీ విస్తరణకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని మంత్రికి వివరించామన్నారు. అంతేకాకుండా మహారాష్ట్ర పర్యాటన సందర్భంగా సేకరించిన సమాచారంతో కూడిన నివేదికను మంత్రికి సమర్పించినట్లు ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నేతలు హాజీ అబ్దుల్ ఫరీద్, మహ్మద్ రఫిక్, మహ్మద్ అంజద్ ఉన్నారు.

ఎరుకల కులస్తులకు మద్దతు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

గోల్కొండ: ఎరుకల కులస్తుల అభ్యున్నతికి, రాజకీయ హక్కుల సాధనకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కృష్ణ, కృష్ణ, చంద్రయ్య, మల్లేష్, బాలరాజ్, రేణుకుమార్ తదితరులున్నారు.

మంత్రి తలసానికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బబూత్ సింగ్, గులాబ్‌సింగ్

అబిడ్స్: జంటనగరాల్లోన్ని రాజ్‌పురోహిత్ సమాజ్ 7వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని సమాజ్ నాయకుడు గోషామహల్ నియోజకవర్గం టీఆర్ఎస్ నేత బబూత్ సింగ్‌తో పాటు పలువురు నేతలు మంత్రికి ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్తర భారతీయుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉండి ఎంతో సహకారం అందిస్తుందని బబూత్ సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గులాబ్‌సింగ్ కేతేశ్వర్ మహారాజ్, విజయరాజ్, దినేష్‌కుమార్, గణపతి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకులకు సమాజంలో గుర్తింపు



భారత్ సేవక్ సమాజ్ కేలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి హరీష్ రావు

గోల్కొండ: సంఘ సేవకులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో భారత్ సేవక్ వారు రూపొందించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత్ సేవక్ సమాజ్ వారు నిస్వార్థంగా ప్రజలకు చేస్తున్న సేవలను వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ సేవక్ జాతీయ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజుద్దీన్, ఇంతియాజ్ ఉద్దీన్ అహ్మద్, ఎండీ అసద్ ఉద్దీన్, అక్బర్ బిన్, మొహసన్ తదితరులున్నారు.

'తెలంగాణలో 90శాతం మంది బడుగు బలహీన వర్గాల వారే'



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గోల్కొండ: తెలంగాణలో సుమారు 90శాతం మంది బడుగుబలహీన వర్గాలు వారు ఉన్నారని, అయితే వారిపై అణచివేతి కొనసాగుతుందని బీజేపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్ ఖాజా మెన్షన్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీసీ కులాల ఐక్య వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ఆశా జీవినని, చైతన్యం రగిలించే వారంతా తన మిత్రులని ఆయన అన్నారు. తెలంగాణ బడుగు బలహీన వర్గాల రాష్ట్రమని, అయితే రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉన్నంత వరకు కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులే కేసీఆర్ పార్టీ అధ్యక్షులుగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహ యాదవ్, సిలివేరు శంకర్, సంగెం సూర్యరావు, తుల ఉమ, గుండ్ల ఆంజనేయులుగౌడ్, ప్రదీప్ కుమార్, మంగళారపు మహేష్‌యాదవ్ తదితరులున్నారు.

రమణాచారికి సముచిత స్థానం కల్పించాలి



రమణాచారిని సన్మానిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు కేవీ రమణాచారికి తెలంగాణ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి సీఎం కేసీఆర్‌ను కోరారు. బీఆర్ఎస్ సేవలు ఇక ముందు దేశవ్యాప్తంగా కొనసాగనున్నందున ఆయన సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన పలువురు సంఘం ప్రతినిధులతో కలిసి రమణాచారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో టీటీడీ దేవస్థానం ఈఓగా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా అత్యంత సమర్థవంతంగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్చక సమాఖ్య నాయకులు గంగు ఉపేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

జియాగూడ: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిలభారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజబోయిన లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్‌యాదవ్, గ్రేటర్ అధ్యక్షుడు మైల్కోల్ మహేందర్‌యాదవ్, కార్పొరేటర్ స్వామియాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలో అఖిలభారత యాదవ్ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ కార్వాన్ నియోజకవర్గం సమావేశం, నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ, కమిటీల నియామక పత్రాల అందజేత, సన్మాన కార్యక్రమాలు కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ గజ్జి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈసారి జరిగే సదర్ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే గ్రేటర్‌లో బర్లదొడ్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు, యాదగిరిగుట్టలో 2 ఎకరాల్లో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ చదివే యాదవ విద్యార్థుల కోసం ఢిల్లీ యాదవ భవన్‌లో ఉచిత వసతి కల్పిస్తున్నామన్నారు. శ్రీశైలంలో 150 గదులతో వసతి గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్ అన్ను యాదవ్, ఆరేళ్ల శ్రీశైలం యాదవ్, శివకుమార్‌యాదవ్, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.

సందడిగా పెట్ కార్నివాల్

ఖైరతాబాద్: తెలంగాణ కెనైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన హైదరాబాద్ పెట్ కార్నివాల్‌లో ఆదివారం పెంపుడు జంతువులు, పక్షులు, దున్నలు, గుర్రాలు ఆకట్టుకున్నాయి. ఎప్పు డు చూడని పెంపుడు జంతువులు, జర్మన్ షెపర్డ్, స్విడ్జర్లాండ్, అమెరికా తదితర దేశాలకు చెందిన వివిధ రకాల డాగ్స్ ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి.